సాక్షి రంగారెడ్డి

మంగళవారం ౹ 28 ౹ మే ౹ 2024



ధాన్యం.. దైన్యం

జిల్లాలో ధాన్యం పడించిన రైతు పరిస్థితి దయనీయంగా మారింది. అధికారుల అలసత్వం ఇబ్బంది పడుతున్నారు. 8లో ▸



గుర్తు తెలియని వ్యక్తి మృతి

ఫరూఖ్‌నగర్ మండలం బూర్గుల వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. 8లో ▸



జాగ్రత్తలు తప్పనిసరి

విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. 8లో ▸

న్యూస్‌రీల్

రూ.5 లక్షల విలువైన 18 స్మార్ట్ ఫోన్ల రికవరీ



బాధితులకు ఫోన్లు అందజేస్తున్న పోలీస్ అధికారులు

ఇబ్రహీంపట్నం: వినియోగదారుల నుంచి దొంగిలించబడిన, పోగొట్టుకున్న సుమారు రూ.5 లక్షల విలువ చేసే 18 స్మార్ట్ ఫోన్లను ఇబ్రహీంపట్నం పోలీసులు రికవరీ చేశారు. ఏసీపీ కేపీవీ రాజు, సీఐ సత్యనారాయణ, ఎస్ఐ మారయ్యల సమక్షంలో సోమవారం వీటిని బాధితులకు అందజేశారు. సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న వారు వెంటనే వాటి ఐఎంఈఐ, సీఈఐఆర్‌లను నమోదు చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఖరీదైన ఫోన్ల రికవరీకి కృషిచేసిన క్రైమ్ సిబ్బంది సత్యనారాయణ, బాబురావు, శ్రీలత, నవనీతను ఉన్నతాధికారులు అభినందించారు.

సమస్యల పరిష్కారానికి కృషి



కార్మికులతో మాట్లాడుతున్న మురహరి

ఆమనగల్లు: రాష్ట్రంలో వివిధ పరిశ్రమలలో పనిచేస్తున్న కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు డా.మురహరి బుద్దారం పేర్కొన్నారు. ఆమనగల్లులోని సూర్యలక్ష్మి కాటన్ మిల్లును సోమవారం స్థానిక ఐఎన్‌టీయూసీ నాయకులతో కలిసి సందర్శించారు. కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను మిల్లు యాజమాన్యంతో మాట్లాడి పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. కార్మికులు డస్ట్ అలెర్జీ బారిన పడకుండా మౌత్ మాస్క్ వాడాలన్నారు. కార్మికులకు ఇబ్బందులు లేకుండా, వారి ఆరోగ్యం దెబ్బతినకుండా మిల్లు యాజమాన్యం తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సాయిబాబా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుదర్శన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజు, జిల్లా అధ్యక్షుడు ప్రసాద్, నాయకులు లక్ష్మణ్‌నాయక్, మైసయ్య పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్య

ఆమనగల్లు: మండల పరిధిలోని ఆకుతోటపల్లి సమీపంలో ఉన్న ఓ వ్యవసాయ బావిలో దూకి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ముద్విన్‌కు చెందిన రమేశ్ తన కూతుళ్లతో కలిసి సమీపంలోని మామిడితోట వద్ద కూలీలతో కలిసి పనులు చేస్తున్నాడు. మధ్యాహ్నం వరకు తోట వద్దే ఉన్న రమేశ్ కూతురు స్నేహ(16) ఆతర్వాత కనిపించలేదు. దీంతో గ్రామంలో వెతికారు. తోట సమీపంలోని ఓ వ్యవసాయ బావి వద్ద స్నేహ చెప్పులు కనిపించాయి. దీంతో కొంతమంది బావిలో దూకి వెతకగా మృతదేహం లభ్యమైంది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆమనగల్లు ఏఎస్ఐ యాదయ్య తెలిపారు. బాలిక ఆత్మహత్యకు కారణాలు తెలియలేదు.

ఇంటర్ బోర్డు పారదర్శకంగా వ్యవహరించాలి

హిమాయత్‌నగర్: ఇంటర్ పరీక్ష పేపర్లను దిద్దడంలో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న అధ్యాపకులపై చర్యలు తీసుకోవాలని, ఇంటర్ మూల్యాంకనంలో ఇంటర్ బోర్డ్ పారదర్శకంగా వ్యవహరించాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఇంటర్ బోర్డ్‌ను డిమాండ్ చేసింది. ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, ధర్మేంద్ర సోమవారం హిమాయత్‌నగర్‌లో మాట్లాడుతూ... ఇటీవల ఇంటర్ పరీక్షలు రాసిన విద్యార్థులు తమకు వచ్చిన మార్కులు చూసి అవాక్కవుతున్నారని, తమ అంచనా ప్రకారం మార్కులు రాకపోవడంతో తలలు పట్టుకుంటున్నారని తెలిపారు. ఇంటర్ బోర్డ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

భూముల కబ్జాపై జనం కన్నెర్ర

నందిగామ మండలం రంగాపూర్ రెవెన్యూ పరిధి సర్వేంద్రిగూడ సర్వే నంబర్ 499లోని 5.33 ఎకరాల ఇనాం భూమి ఉంది. ఇందులో 4.33 గుంటలకు సంబంధించి ఇనాం దారులకు ఓఆర్‌సీ ఇచ్చారు. గ్రామ కంఠానికి ఆనుకుని ఉన్న ఎకరం భూమికి ఎలాంటి ఓఆర్‌సీ ఇవ్వలేదు. ఈ స్థలంలో మిషన్ భగీరథ ట్యాంకును నిర్మించారు. తాజాగా ఓ వ్యక్తి ఈ భూమిపై కన్నేశాడు. తప్పుడు పత్రాలతో రిజిస్ట్రేషన్ చేసుకుని, చుట్టూ ప్రీ కాస్ట్ గోడలు నిర్మించగా స్థానికులు అడ్డుకున్నారు.

– సాక్షి, రంగారెడ్డి జిల్లా





కందుకూరులో నక్షబాట కబ్జాకు నిరసనగా ఆందోళన చేస్తున్న జనం

ఆక్రమణలను అడ్డుకుంటున్న స్థానిక ప్రజలు

- కబ్జారాయుళ్లపై ఫిర్యాదుల వెల్లువ
- అధికారుల ఆధ్వర్యంలో కూల్చివేతలు, హెచ్చరిక బోర్డులు

- ప్రభుత్వ భూముల అన్యాక్రాంతంపై ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి.
- ప్రజా అవసరాల కోసం ఉపయోగపడాల్సిన ఈ విలువైన భూములకు కనీస రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోతున్నాయని, వీటిని కాపాడాలంటూ స్థానికులు రెవెన్యూ అధికారులకు మొర పెట్టుకుంటున్నారు.
- ఇటీవల రెవెన్యూ అధికారులకు అందుతున్న ఫిర్యాదుల్లో ప్రభుత్వ భూముల పరిరక్షణకు సంబంధించినవే ఎక్కువగా ఉండటం గమనార్హం.
- వెంటనే అప్రమత్తమవుతున్న అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చేస్తున్నారు. ఖాళీ భూములకు హద్దులు నిర్ణయించి, తాత్కాలికంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు.
- అయినా ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు.

దేవుడి మాన్యానికీ దిక్కులేదు

- ఫరూఖ్‌నగర్‌లో ఎలికట్ట భవానీమాత ఆలయానికి సర్వే నంబర్ 441లో 3.08 ఎకరాల భూమి ఉంది.
- దేవాదాయశాఖ రిజిస్టర్‌లో 43వ నంబర్‌పై నమోదైంది.
- ఈ భూమికి తామే అనుభవ దారులమంటూ ఇటీవల కొంత మంది ఆక్రమణకు యత్నించగా, స్థానికులు దేవాదాయ శాఖ అదనపు కమిషనర్‌కి ఫిర్యాదు చేశారు.
- మాడ్గుల మండలం అర్కపల్లి పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది.
- బాపనికుంట, ఆంజనేయస్వామి దేవాలయం, ప్రభుత్వ పాఠశాల భూమి, పంచాయతీ భవనం చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి.
- వీటిని పరిరక్షించాల్సిందిగా కోరుతూ ఇటీవల పలువురు గ్రామస్తులు తహసీల్దార్ సునీల్‌కు ఫిర్యాదు చేశారు.

చెరువుల చెర

- రాజేంద్రనగర్ మండలం ప్రేమావతిపేట్ పరిధిలోని శిలాన్ చెరువును కబ్జా చేసేందుకు కొంత మంది యత్నిస్తుండగా, స్థానికులు అడ్డుకుని, అధికారులకు ఫిర్యాదు చేశారు.
- ఎఫ్‌టీఎల్ జోన్‌లో మట్టి నింపి, చదును చేసేందుకు యత్నించగా తీవ్రంగా ప్రతిఘటించారు.
- హిమాయత్‌సాగర్ సమీపంలోని సర్వే నంబర్ 69లో రూ.150 కోట్ల విలువైన పదెకరాల ఖారీజ్‌ఖాతా భూములను ఆక్రమించి, ప్రైవేటు పట్టా భూములుగా చూపించే ప్రయత్నం చేశారు.
- బండ్లగూడ జాగీర్ గండంగూడ సర్వే నంబర్ 51లో తాతల కాలం నాటి రోడ్డును ఆక్రమించి, రాత్రికి రాత్రే మూసివేశారు.
- దీంతో స్థానికులు రోడ్డుపై బైఠాయించి, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు.

ప్రకృతి వనాలనూ వదలని వైనం

- అబ్దుల్లాపూర్‌మెట్ సర్వేనంబర్ 283లో ప్రభుత్వ భూమి ఉంది.
- పేదలకు అసైన్డ్ చేసిన ఈ భూమిని 2005లోనే పీఓటీ కింద వెనక్కి తీసుకుంది.
- జేఎన్ఎన్‌యూఆర్ఎం కాలనీ నిర్మాణం చేసి, పదెకరాల్లో పేదలకు ఇళ్ల స్థలాలు కూడా ఇచ్చింది.
- రెవెన్యూ ఆఫీసు సహా పోలీస్ స్టేషన్ కూడా ఇదే భూమిలోనే నిర్మించారు.
- ఇందులోని పల్లె ప్రకృతి వనానికి సంబంధించిన చెట్లను తొలగించి, ఖాళీగా ఉన్న భూమిపై స్థానిక రియల్టర్లు కన్నేశారు.
- 25 ఎకరాల మేర కబ్జా చేసి, దాని చుట్టూ ప్రీకాస్ట్ నిర్మాణాలు చేస్తున్నారు.
- కేశంపేట మండలం దత్తాయపల్లి శివారు సర్వే నంబర్ 27లో 3.16 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. 1974 వరకు రెవెన్యూ రికార్డుల్లో ప్రభుత్వ భూమిగానే రికార్డై ఉంది. ఇప్పటికే దీన్ని పట్టా భూమిగా మార్చేశారు.

నకిలీలపై ఉక్కుపాదం

- కృత్రిమ కొరత సృష్టిస్తే లైసెన్స్‌లు రద్దు
- అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలు సీజ్
- 'సాక్షి'తో జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి
- విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని రైతులకు సూచన



సాక్షి, రంగారెడ్డి జిల్లా: 'నకిలీ విత్తన విక్రయదారులపై ఉక్కుపాదం మోపుతాం. కృత్రిమ కొరత సృష్టించి, అధిక ధరలకు విత్తనాలు విక్రయించే డీలర్ల లైసెన్సులు రద్దు చేస్తాం. రైతులను మోసం చేసే వ్యాపారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోం' అని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి గీతారెడ్డి హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలు ఆమె మాటల్లోనే.. ఎస్‌ఓటీ పోలీసుల సహకారంతో ఏఓలు, ఏఈఓలు మండల కేంద్రాల్లోని ఎరువులు, విత్తన విక్రయ దుకాణాల్లో తనిఖీలు చేస్తున్నారు. కంపెనీల నుంచి సరఫరా అయిన విత్తనాలు, ఎరువులు, ఈ పాస్ ద్వారా రోజువారీగా జరుగుతున్న విక్రయాలు, కొనుగోలు చేసిన రైతులు, మిగిలి ఉన్న నిల్వల వివరాలపై ఎప్పటికప్పుడు ఆరా తీస్తున్నాం.

సాగు విస్తీర్ణం పెంపునకు చర్యలు

జిల్లాలో గతేడాది ఖరీఫ్‌లో 4,45,428 ఎకరాల్లో పంటలు సాగు చేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. గతేడాది 1,29,088 ఎకరాల్లో పత్తి సాగు చేయగా, ఈసారి 1,76,174 ఎకరాల్లో సాగును లక్ష్యంగా పెట్టుకున్నాం. గతేడాది 1,40,280 ఎకరాల్లో వరి వేయగా, ఈసారి 1,38,187 ఎకరాలకు పెంచాలని నిర్ణయించాం. పెసర, మొక్కజొన్న, మినుములు, కంది పంటలను మరింత ప్రోత్సహించే దిశగా సాగుతున్నాం. 34,547 క్వింటాళ్ల వరి, 5,322 క్వింటాళ్ల మొక్కజొన్న, 346 క్వింటాళ్ల కంది, 1,498 క్వింటాళ్ల జనుము, 280 క్వింటాళ్ల జీలుగ, 134 క్వింటాళ్ల జొన్న, 43 క్వింటాళ్ల మినుము విత్తనాలతో పాటు 4,91,036 పత్తి విత్తనాల ప్యాకెట్లు (450 గ్రాముల) అందుబాటులో ఉంచాం. 41,115 టన్నుల యూరియా, 14,897 టన్నుల డీఏపీ, 4,283 టన్నుల ఎస్ఎస్‌పీ, 5,139 టన్నుల ఎంఓపీ, 36,548 టన్నుల కాంప్లెక్స్ ఎరువులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయి.

బ్లాక్ మార్కెట్‌కు తరలకుండా

వర్షాకాలం సమీపిస్తుండటంతో ఇప్పటికే రైతులు దుక్కులు దున్ని, సాగుకు సిద్ధం చేస్తున్నారు. ఎక్కువ మంది పత్తి సాగుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 350 మంది ఎరువులు, విత్తనాల డీలర్లు ఉన్నారు. యూఎస్ 7067, ఆద్య, రేవంత్, సదానంద్ వంటి రకం పత్తి విత్తనాలకు మార్కెట్లో మంచి డిమాండ్ ఉన్నట్లు తెలుస్తోంది. దీన్ని కొంతమంది వ్యాపారులు క్యాష్ చేసుకుంటున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఆయా కంపెనీల విత్తనాలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి, అధిక ధరకు విక్రయిస్తున్నట్లు ఇప్పటికే మా దృష్టికి కూడా వచ్చింది. ఏఓలు, ఏఈఓలు డీలర్ల వద్దకు చేరుకుని స్టాక్ చెక్ చేస్తున్నారు. ఈ పాస్ ద్వారా విక్రయాలు చేపట్టాల్సిందిగా డీలర్లందరికీ ఆదేశాలు జారీ చేశాం. క్రయవిక్రయాల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించాం. కృత్రిమ కొరత సృష్టించకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాం.

శంకర్‌పల్లిలో విత్తనాలు స్వాధీనం

నకిలీలను అరికట్టేందుకు ఇప్పటికే మండలానికి ఒక తనిఖీ బృందాన్ని ఏర్పాటు చేశాం. ఇందులో ఏఓ, ఏఈఓ సహా ఎస్‌ఓటీ పోలీసు ఉంటారు. అనుమానం ఉన్న దుకాణాలకు వెళ్లి తనిఖీలు చేస్తున్నాయి. రెండు రోజుల క్రితం శంకర్‌పల్లిలోని ఓ ఇంట్లో నిల్వ ఉన్న 240 కేజీల లూజు పత్తి విత్తనాలను స్వాధీనం చేసుకున్నాం. విక్రయదారుపై కేసు నమోదు చేయించాం. రైతులెవరూ వ్యాపారులను గుడ్డిగా నమ్మొద్దు. సాగుపై ఉన్న అనుభవం, దిగుబడి వంటి అంశాలను దృష్టిలో పెట్టుకుని విత్తనాలు కొనుగోలు చేయాలి. విధిగా రసీదు పొందాలి. ప్రభుత్వ నిర్దేశిత ధరలకన్నా ఎక్కువకు విక్రయించే వారిపై చర్యలు తప్పవు. దుకాణాల ఎదుట ధరల పట్టిక, ఎరువులు, విత్తనాల నిల్వలకు సంబంధించిన బోర్డులు విధిగా ఏర్పాటు చేయాలని ఆదేశించాం.



నర్సరీని పరిశీలిస్తున్న జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

ప్రతి జీపీలో ఆరు వేల మొక్కలు

- నాటడం, సంరక్షణను నిర్లక్ష్యం చేయొద్దు
- జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి

యాచారం: జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఆరు వేల మొక్కలు నాటాలని, ఆ దిశగా అధికారులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి సూచించారు. నందివనపర్తిలోని నర్సరీని సోమవారం ఆయన పరిశీలించారు. ఏఏ మొక్కలు పెంచుతున్నారు, గతంలో నాటిన మొక్కల పెంపకం ఎలా ఉంది, ఉపాధి కూలీల ద్వారా గుంతలు తీయిస్తున్నారా, నర్సరీలో నిత్యం ఎంత మంది కూలీలు పని చేస్తున్నారు. తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలో తాగునీటి నీటి సరఫరా ఎలా ఉంది, ప్రజలకు సరిపడా అందుతున్నాయా..? డ్రైనేజీ వ్యవస్థ ఎలా ఉంది..? కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో చేపట్టిన అభివృద్ధి పనుల్లో పురోగతి తదితర విషయాలను ఎంపీడీఓతో చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వర్షాలు కురిసే లోపు గ్రామాల్లో గుంతలు తీసే పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామంలో ఆరు వేల మొక్కలు నాటేలా కృషి చేయాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణే లక్ష్యంగా కృషి చేయాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఆయన వెంట మండల పంచాయతీ అధికారి ఉమారాణి తదితరులు ఉన్నారు.

మహిళా శక్తితో 'యూనిఫాంలు'

- డీఆర్‌డీఏ పీడీ శ్రీలత
- కుట్టు మిషన్ కేంద్రాల పరిశీలన

మహేశ్వరం: ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉచిత ఏకరూప దుస్తులు కుట్టిస్తున్నామని డీఆర్‌డీఏ పీడీ శ్రీలత తెలిపారు. మండల పరిధిలోని తుమ్మలూరు, హర్షగూడ, మహేశ్వరం గ్రామాల్లోని మహిళా శక్తి కుట్టు మిషన్ కేంద్రాలను సోమవారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టిందన్నారు. మహేశ్వరం మండలంలోని 43 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 4,596 మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రెండు జతల చొప్పున 9,192 డ్రెస్‌లు కుట్టిస్తున్నామని స్పష్టంచేశారు. ఇందుకోసం మహేశ్వరం, తుమ్మలూరు, నాగారం, దుబ్బచర్ల, హర్షగూడ క్లస్టర్లలో మహిళా శక్తి కుట్టు మిషన్ సెంటర్లను ఏర్పాటు చేసి, 69 మంది మహిళలతో యూనిఫాంలు సిద్ధం చేయిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో మహేశ్వరం ఏపీఎం సత్యనారాయణ, సీసీలు కుమార్, సురేష్,యాదయ్య,నర్సింగ్ రావు, వీఓఏలు, గ్రామ సంఘాల అధ్యక్షులు పాల్గొన్నారు.



తుమ్మలూరులో యూనిఫాంలను పరిశీలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీలత, ఏపీఎం సత్యనారాయణ

బీ కేర్ ఫుల్

- వర్షాకాలం నేపథ్యంలో అప్రమత్తంగా ఉండండి
- పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలపై దృష్టి సారించండి
- తాగునీరు, పారిశుద్ధ్య సమస్యలు రానీయొద్దు
- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోండి
- అధికారుల సమావేశంలో కలెక్టర్ శశాంక ఆదేశం



అడిషనల్ కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డి జిల్లా: వర్షాకాలం నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ శశాంక ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. వాతావరణ మార్పులపై (వర్షపాతం) అదనపు కలెక్టర్లు ప్రతిమాసింగ్, భూపాల్‌రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులతో చర్చించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నట్లు వాతావరణ శాఖ సూచనలు చేస్తున్న నేపథ్యంలో ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రత్యేక అధికారుల నేతృత్వంలో మండల స్థాయి సమావేశాలు నిర్వహించి క్షేత్రస్థాయి పరిస్థితులపై చర్చించాలని, అవసరమైన పనులను వెంటనే ప్రారంభించాలని తెలిపారు. ఇందుకోసం సమగ్ర కార్యాచరణ రూపొందించుకోవాలన్నారు. మండల స్థాయి సమావేశం నిర్వహించడానికి ముందు క్షేత్ర స్థాయిలో పర్యటించి వాస్తవ పరిస్థితులను పరిశీలించాలని సూచించారు.

శిథిలమైన స్కూళ్లపై నజర్

పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల విషయంలో ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని కలెక్టర్ ఆదేశించారు. సంక్షేమ హాస్టళ్లు, రెసిడెన్షియల్ స్కూళ్లకు చెందిన విద్యార్థులు బయటకు వెళ్లేందుకు అనుమతి ఇవ్వకూడదని తెలిపారు. ఎక్కడ కూడా అవాంఛనీయ ఘటన జరుగకుండా ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా షార్ట్ సర్క్యూట్‌తో విద్యుత్ ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నందున, అవసరమైన చోట తక్షణ మరమ్మతులు జరిపించాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల విద్యుత్ సరఫరా వ్యవస్థకు ఆటంకం లేకుండా యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టాలన్నారు. నివాస ప్రాంతాలకు కరెంటు సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా పకడ్బందీగా వ్యవహరించాలని, ఎక్కడైనా సాంకేతిక సమస్య తలెత్తిన వెంటనే పరిష్కరించాలన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్త

ప్రతీ నివాస ప్రాంతంలో పారిశుద్ధ్య పనులు, రక్షిత మంచి నీటి సరఫరా జరిగేలా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. ఎక్కడైనా పైప్లైన్ లీకేజీలు ఏర్పడితే వెంటనే సరి చేసుకోవాలని సూచించారు. మంచినీటి ట్యాంకులను శుభ్రం చేయించాలని, నివాస ప్రాంతాల నడుమ వర్షపు నీరు నిల్వకుండా చూడాలని సూచించారు. ఎక్కువ నీళ్ల నిల్వ ఉన్న చోట దోమల వ్యాప్తిని నిరోధించేందుకు ఆయిల్ బాల్స్ వేయించాలన్నారు. శానిటేషన్, తాగునీటి సరఫరా విషయంలో ఏమాత్రం నిర్లక్ష్యానికి తావీయొద్దని, సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వర్తించాలన్నారు.

గ్రామాల వారీగా నివేదికలు ఇవ్వండి

క్షేత్ర స్థాయిలో స్పెషల్ ఆఫీసర్లుగా కేటాయించబడిన అధికారులు పరిశీలించి గ్రామాల వారీగా నివేదికలు సమర్పించాలని తెలిపారు. వరద నీటి ప్రవాహానికి రహదారులను దెబ్బతినే అవకాశం ఉన్నందున ముందుగా గుర్తిస్తూ, తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్ అధికారులకు సూచించారు. ఎక్కడా ప్రమాదాలు జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. దెబ్బతిన్న చెరువులు, చెక్ డ్యాంలు, కాల్వలు తదితర వాటి వివరాలను సేకరించి నివేదిక సమర్పించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు.



మాట్లాడుతున్న త్రిదండి చిన్నజీయర్‌స్వామి

భక్తిభావం అలవర్చుకోవాలి

త్రిదండి చినజీయర్‌స్వామి



విద్యార్థినుల నృత్య ప్రదర్శన

ఆమనగల్లు: విద్యార్థులు చిన్ననాటి నుంచే భక్తిభావాలు అలవర్చుకోవాలని త్రిదండి చినజీయర్ స్వామి అన్నారు. శృతిలయ కల్చరల్ అకాడమీ, వందేమాతరం ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నెలరోజులుగా నిర్వహించిన వేసవి సంగీత, నృత్య శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సోమవారం రాత్రి బీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన విద్యార్థుల కళా ప్రదర్శనలను తిలకించి అభినందించారు. కార్యక్రమంలో కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, మాజీ ఎంపీ మల్లు రవి, బీజేపీ నేత ఆచారి, ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీసింగ్, ఎంపీపీలు అనిత, నిర్మల, కమ్లి మోత్యానాయక్, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, నిర్వాహకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి


మృతి చెందిన వ్యక్తి

షాద్‌నగర్‌రూరల్‌: ఫరూఖ్‌నగర్‌ మండల పరిధిలోని బూ ర్గుల గ్రామంలో జాతీ య రహదారిపై సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు సీఐ ప్రతాప్‌లింగం తెలిపారు. సుమారు 45 ఏళ్ల వయస్సు ఉన్న వ్యక్తి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టినట్లు వివరించారు. స్థానికులు వెంటనే గాయపడిన వ్యక్తిని ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని షాద్‌నగర్‌ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపడుతున్నట్లు సీఐ తెలిపారు.

ధాన్యం.. దైన్యం

ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అమ్ముకుందామంటే కష్టాలు తప్పడం లేదు. కొనుగోలు ప్రక్రియ నెమ్మదించడంతో పాటు.. కాంటా వేసిన ధాన్యాన్ని తరలించడంలో నిర్వాహకులు తీవ్ర జాప్యం చేస్తుండగా.. వాతావరణంలో వచ్చిన మార్పులు కర్షకులను కలవర పెడుతున్నాయి. దిగుబడి కళ్లముందే తడిసి ముద్దయి వారిని కన్నీటి పర్యంతం చేస్తోంది. తడిసిన ధాన్యం కొనుగోలు చేయడానికి నిరాకరించడం.. ఒక వేళ తీసుకున్నా.. తేమ పేరుతో కొర్రీలు పెడుతున్నారు. గండం గట్టెక్కినా.. ధాన్యం డబ్బులు వచ్చేసరికి వారంపది రోజుల సమయం పడుతోంది. ఇదే తంతు ఉమ్మడి జిల్లాలో కొనసాగుతుండటంతో.. ఈ కష్టాలు పడలేమంటూ మెజార్టీ రైతులు.. దళారులను ఆశ్రయిస్తున్న వైనంపై 'సాక్షి' ప్రత్యేక కథనం

ఇంకా రైతుల వద్దే అత్యధిక దిగుబడి

- కొనుగోలు కేంద్రాల్లో కొర్రీలు
- తేమ, తాలు పేరుతో రైతులను తిప్పిపంపుతున్న నిర్వాహకులు
- చేసేదిలేక దళారులను ఆశ్రయిస్తున్న అన్నదాతలు


మహేశ్వరం: మండల కేంద్రంలో ధాన్యం కొనుగోళ్లు


కందుకూరు: కొనుగోలు కేంద్రంలో వృథాగా పడున్న గన్నీ బ్యాగులు

వికారాబాద్‌: జిల్లాలో ధాన్యం పండించిన రైతు పరిస్థితి దయనీయంగా మారింది. అధికారుల అలసత్వం, కొరవడిన ముందుచూపు వారి పాలిట శాపమయింది. వర్షాకాలం ముంచుకొచ్చినా.. కొనుగోలు ప్రక్రియ ఊపందుకోలేదు. వికారాబాద్‌ జిల్లాలో ధాన్యం కొనుగోలు లక్ష్యం 1.20 లక్షల మెట్రిక్‌ టన్నులు కాగా.. అందులో సగానికి చేరుకోలేక పోయారు. ఏ కొనుగోలు కేంద్రంలో చూసినా వేల కొద్ది బస్తాల ధాన్యం పేరుకుపోయింది. ఇదంతా సంబంధిత అధికారుల ప్రణాళిక లోపమేనని స్పష్టమవుతోంది. సేకరించిన ధాన్యానికి సంబంధించిన డబ్బులు సకాలంలో రావటం లేదని పలువురు రైతులు పేర్కొంటున్నారు. ఇదే విషయాన్ని అధికారులు అంగీకరిస్తూ.. కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు డాటా ఎంట్రీ చేయకపోవటం వలనే రైతుల ఖాతాల్లో డబ్బులు ఆలస్యంగా జమ అవుతున్నట్లు వెల్లడించారు. ఒక పక్క కొనుగోళ్ల నెమ్మదించడం, సేకరించిన వాటికి డబ్బులు ఆలస్యంగా ఇస్తుండటం.. మరో పక్క వరుణుడు ఉరుముతుండటంతో అన్నదాతలు తమ దిగుబడిని తక్కువ ధరకైనా ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి సొమ్ముచేసుకోవటం గమనార్హం.

సగానికి పైగా.. రైతుల వద్దే

యాసంగి సీజన్‌లో జిల్లాలో 90 వేల ఎకరాల్లో వరి సాగు చేయగా.. సుమారు రెండు లక్షల మెట్రిక్‌ టన్నుల దిగుబడి వస్తుందని అధికారుల అంచనా. 1.20 లక్షల మెట్రిక్‌ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని పౌరసరఫరాల శాఖ లక్ష్యంగా పెట్టుకుంది. జిల్లాలో మొత్తం 129 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ.. ఇప్పటి వరకు 34 వేల మె.ట. ధాన్యం మాత్రమే సేకరించారు. వీటికి సంబంధించి రూ.76.83 కోట్లు చెల్లించాల్సి ఉండగా.. ఇప్పటి వరకు రూ.22.36 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమచేశారు. సేకరించాల్సిన లక్ష్యం ఇంకా 75 శాతం ఉండగా.. జిల్లాలో ఇప్పటికే 30 కొనుగోలు కేంద్రాలు మూసేశారు. ఇలా ఇంటిల్లి పాది రేయింబవళ్లు చెమటోడ్చి పండించిన ధాన్యం అమ్ముకోవాలంటే ఎన్ని తంటాలు పడాల్సి వస్తుందోనని అన్నదాతలు విచారం వ్యక్తంచేస్తున్నారు.

దళారులకే మొగ్గు

కందుకూరు: స్థానిక పీఏసీఎస్‌ కార్యాలయంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించడానికి రైతులు ఎవరు కూడా.. ముందుకు రావడంలేదు. ఆరు వేల గన్నీ బ్యాగులు సిద్ధంగా ఉన్నాయి. అయినప్పటికీ ఈ కేంద్రానికి రైతులు ధాన్యం తీసుకురాకపోవడం గల కారణం.. ప్రభుత్వ మద్దతు ధర కంటే.. బయటి మార్కెట్లో ఎక్కువగా వస్తుండటమే.. ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు ఏ గ్రేడ్‌ రకం రూ.2,203, సాధారణ రకం రూ.2,180 లెక్కన సేకరిస్తున్నారు. తేమ శాతం 17 లోపు ఉండి, తాలు లేకుండా కొనుగోలు కేంద్రానికి తీసుకురావాలి. దాంతో పాటు అంతా సక్రమంగా ఉన్నా తరుగు పేరుతో కొర్రీ పెట్టడంతో దళారులకు విక్రయించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నట్లు తెలుస్తోంది. బహిరంగ మార్కెట్‌లో నాణ్యతను బట్టి రూ.2వేల నుంచి రూ.2,200, రూ.2,350ల చొప్పున, నేరుగా కల్లాల నుంచే వ్యాపారులు సేకరిస్తున్నారు. దీంతో రవాణా కష్టాలు, తేమ తిప్పలు రైతులకు తప్పినట్లయింది. అందుకే ప్రభుత్వ కొనుగోలు కేంద్రం బోసిపోయి కనిపిస్తోంది.

రెండు రోజుల్లో కేంద్రాల మూత

కొడంగల్‌: నియోజకవర్గంలో వరి ధాన్యం దిగుబడి ఆశించిన స్థాయిలో రాలేదని రైతులు తెలిపారు. రబీ సీజన్‌లో భూగర్భ జలాలు అడుగంటి, పంట పొలాలకు సరిగా నీరు అందకనే.. దిగుబడి తగ్గిందని పేర్కొంటున్నారు. మండల పరిధిలో.. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో కొడంగల్‌, పెద్ద నందిగామ, హస్నాబాద్‌, చిట్లపల్లి, అంగడిరాయిచూర్‌ గ్రామాల్లో కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ ఆధ్వర్యంలో పర్సాపూర్‌, అప్పాయిపల్లిలో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఏ గ్రేడు వరి ధాన్యం రూ.2,203, బి–గ్రేడ్‌కు రూ.2,183 మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నారు. పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో గన్నీ బ్యాగులు, టార్పాలిన్లు అందుబాటులో ఉన్నాయి. ధాన్యం అమ్మిన వారం రోజుల్లో ఖాతాల్లో డబ్బులు జమ అవుతున్నాయని రైతులు తెలిపారు. తహసీల్దార్‌ విజయ్‌కుమార్‌ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పర్యవేక్షించి, సలహాలు, సూచనలు ఇస్తున్నారు. ధాన్యం విక్రయానికి రైతులు రాకపోవడంతో స్థానిక మార్కెట్‌ యార్డులో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మూసివేశారు. మిగతా సెంటర్లను రెండు మూడు రోజుల్లో మూసి వేయనున్నట్లు పీఏసీఎస్‌ చైర్మన్‌ శివకుమార్‌ గుప్తా తెలిపారు. మండలంలోని ఏడు కేంద్రాల్లో సుమారు 12 వేల క్వింటాళ్ల ధాన్యం సేకరించినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి.

మిల్లర్ల మాయాజలం

పరిగి: వరి ధాన్యం కొనుగోలులో మిల్లర్లు మాయాజాలం చేస్తున్నారు. రైతుల నుంచి కొనుగోలు కేంద్రం ధాన్యం సేకరించి, మిల్లుకు పంపితే.. వరి బాగాలేదని రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. ధాన్యం ఎలా ఉన్నా కొనుగోలు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా.. తరుగు పేరుతో నాలుగైదు కిలోలకు కోత పెడుతున్నారు. తడి ఉంటే మిల్లులో తీసుకోవడం లేదని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తెలిపారు. ఇదిలా ఉండగా.. కొనుగోలు అనంతరం ధాన్యం మిల్లుకు చేరాగా.. నూకవస్తుందంటూ మరింత కోత పెట్టేందుకు మిల్లరు సిద్ధమయ్యారని రైతు శ్రీను తెలిపారు.

కొనుగోలు కేంద్రం లేక..

షాబాద్‌: మండల పరిధి సర్దార్‌నగర్‌లో ఈ సారి ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఏటా ఇక్కడే కొనుగోలు చేసేవారు.. కాని ఈ సారి లేకపోవడంతో వారికి ఇక్కట్లు తప్పడం లేదు. షాబాద్‌ మండల పరిధిలో 6వేల ఎకరాల్లో వరి సాగు అయింది. అందుబాటులో కొనుగోలు కేంద్రం లేకపోవడంతో మరోమార్గం దళారులకు విక్రయించాల్సి వస్తుందని రైతులు తెలిపారు. రైస్‌ మిల్లర్లను ఆశ్రయిస్తే.. నిలువునా దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని అధికారులు చెబుతుండగా.. ఇక్కడ ఉన్న కేంద్రాన్ని ఎత్తివేయడమేంటని ప్రశ్నించారు.

ఆసక్తి చూపని రైతులు

ఆమనగల్లు: ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ రైతులు.. తమ ధాన్యాన్ని మిల్లర్లకే విక్రయిస్తున్నారు. ప్రభుత్వ మద్దతు ధర కంటే.. ప్రైవేటు వ్యక్తులు ఎక్కువగా ఇస్తుండటంతో.. వారికి అమ్మేందుకు మొగ్గుచూపుతున్నారు. తొలుత కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించడానికి తీసుకువచ్చినప్పటికీ తేమ శాతం అధికంగా ఉందని, నిబంధనల మేరకే కొనుగోలు చేస్తామని నిర్వాహకులు చెప్పడంతో.. రైతులు దళారులకు విక్రయిస్తున్నారు. కొనుగోలు కేంద్రంలో ఏగ్రేడ్‌ రకం ధాన్యం క్వింటాకు రూ.2,203, బి–గ్రేడ్‌కు రూ.2,183గా ప్రభుత్వం మద్దతు ధర ప్రకటించింది. ప్రైవేటు వ్యక్తులు అధిక ధరకు కొనుగోలు చేస్తుండటంతో వారికే దిగుబడిని ఇస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో ఇప్పటి వరకు 67 మంది రైతులు 3,400 క్వింటాళ్ల ధాన్యాన్ని విక్రయించగా.. 37 మందికి బిల్లులు వచ్చాయి. గత ఏడాది 10 వేల క్వింటాళ్లకు పైగా వరి కొనుగోలు చేయగా.. ఈ సారి కేవలం 3,400 క్వింటాళ్ల కొనుగోలు జరిగింది.

తేమ సాకుతో తిప్పిపంపారు


మంచాల: కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా పెడుతున్న హమాలీలు

మంచాల: రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలో ధాన్యం కొనుగోలు తక్కువగా జరిగింది. గతంలో కేవలం మంచాలలో 30వేల బస్తాలకు పైగా ధాన్యం సేకరణ జరిగేది. ప్రస్తుతం స్థానిక కొనుగోలు కేంద్రంలో 137 మంది రైతుల నుంచి 18వేల 417 ధాన్యం బస్తాలను కొనుగోలు చేశారు. మరో రెండు రోజుల పాటు సేకరించనున్నట్లు నిర్వాహకులు రజిత తెలిపారు. బోడ కొండలో 297 మంది రైతుల నుంచి 27వేల 442 బస్తాల ధాన్యం సేకరించారు. ఇదిలా ఉండగా.. వర్షం కారణంగా రైతులు వారం రోజులుగా ఇబ్బంది పడుతున్నారు. తేమ శాతం 18దాటితే కొనుగోలు కేంద్రాల్లో తీసుకోవడం లేదని రైతులు తెలిపారు. వాతావరణంలో వచ్చిన మార్పుల వలన మధ్యాహ్నం 18శాతం ఉన్న తేమ కాస్త.. ఉదయం 22శాతం పెరగుతుందని పేర్కొంటున్నారు. తేమ తగ్గిన తరువాతనే నిర్వాహకులు ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. తేమ ఎక్కువ ఉందనే సాకుతో.. మంచాల కొనుగోలు కేంద్రం నుంచి రైస్‌ మిల్లుకు ధాన్యం లోడుతో వెళ్లిన రెండు లారీలను తిరిగి కేంద్రానికి పంపించారు.

ప్రైవేటు వ్యక్తులకే విక్రయం


యాచారం: చింతపట్ల కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరణ

యాచారం: మండల పరిధి చింతపట్ల, నందివనపర్తి, యాచారం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన ధర ప్రకారం ఏ గ్రేడ్‌ క్వింటా ధాన్యానికి రూ.2,163, బీ గ్రేడ్‌కు రూ.2,083లను చెల్లిస్తున్నారు. మండల పరిధిలో మొత్తం 4,800 ఎకరాల్లో వరి సాగు కాగా.. ఇప్పటి వరకు అన్ని గ్రామాల నుంచి 190 మంది రైతులు 6,649 క్వింటాళ్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తెచ్చారు. 4,800 ఎకరాల్లో.. ప్రతి ఎకరాకు 23 నుంచి 25 క్వింటాళ్ల ధాన్యం వస్తుంది. అంటే 1.20 లక్షల క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉంది. కానీ ఇక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రం కంటే.. దళారులకు విక్రయించేందుకు రైతులు మొగ్గుచూపుతున్నారు. అలా ఇప్పటి వరకు 200 మందికి పైగా రైతులు 25 వేల క్వింటాళ్లకు పైగా ధాన్యాన్ని అమ్మినట్లు తెలుస్తోంది. కాస్త ధర తక్కువైనా.. ఎలాంటి షరతులు లేకుండా ప్రైవేటు వ్యక్తులు ధాన్యం సేకరించడమే కాకుండా.. డబ్బులు కూడా వెంటనే చెల్లిస్తుండటంతో.. అన్నదాతలు అటువైపే ఆసక్తిచూపుతున్నారు.

32 వేల బస్తాల ధాన్యం


పెద్దేముల్‌: జనగాంలో ధాన్యం తూకం వేస్తున్న హమాలీలు

పెద్దేముల్‌: మండలంలోని మంబాపూర్‌, జనగాం ధాన్య కొనుగోలు కేంద్రాల నుంచి సోమవారం నాటికి 32వేల బస్తాల ధాన్యం కొనుగోలు చేశామని, ఇంకా సుమారు 16వేల బస్తాల వరకు రానుందని కేంద్రం ఇన్‌చార్జి నజీర్‌ తెలిపారు. మంబాపూర్‌ సెంటర్‌లో 23వేలు, జనగాంలో 9వేలు ఏ గ్రేడ్‌ వరిని సేకరించినట్లు చెప్పారు. ఇదిలా ఉండగా.. తేమ శాతం ప్రకారం రైతుల నుంచి బీసీఎంఎస్‌ అధికారులు తూకం వేసినా.. సమయానికి లారీలు రాక రైతులు పలు ఇబ్బంది పడ్డారు.

ఆందోళన వద్దు



జిల్లాలో పంట ఆలస్యంగా వచ్చింది. లారీలు కూడా ఎక్కువ సంఖ్యలో అందుబాటులో ఉంచాం. ధాన్యం సేకరణ వేగవంతం చేసి, ఇబ్బంది లేకుండా చూస్తాం. డాటా ఎంట్రీ జాప్యం వలన బిల్లుల చెల్లింపులో కొంత లేటు అవుతోంది. ప్రభుత్వం నుంచి డబ్బులు మంజూరు కావడంలో ఎలాంటి ఇబ్బంది లేదు. ధాన్యం సేకరించి, డాటా ఎంట్రీ అనంతరం మిల్లర్ల వద్ద కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు రసీదు తీసుకుంటే.. రెండు మూడు రోజుల్లో రైతుల ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి. ఆఖరి గింజ వరకు కొంటాం. రైతులు ఆందోళన చెందవద్దు.

– సుగుణబాయి, డీఎం సివిల్‌ సప్లయ్‌, వికారాబాద్‌

తేమ, తరుగు పేరుతో జాప్యం

మహేశ్వరం: మండలంలోని పీఏసీఎస్‌ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రంలో మండల పరిధి, తుక్కుగూడ మున్సిపాలిటీ నాలుగు గ్రామాల రైతులు తమ దిగుబడిని ఇక్కడే విక్రయిస్తుంటారు. స్థానిక రైతు వేదిక వద్ద కొనుగోలు ప్రక్రియ కొనసాగుతుంటుంది. ప్రభుత్వం క్వింటా వరి ధాన్యం ఏ గ్రేడ్‌ రకానికి రూ.2,203, గ్రేడ్‌–బికి రూ.2,183 మద్దతు ధర చెల్లిస్తోంది. అయితే కొనుగోలు ప్రక్రియ నెమ్మదించడంతో పాటు, తేమ, తరుగు పేరుతో ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు అన్నదాతలు ఆరోపిస్తున్నారు.

భారమైన హమాలీల కూలి



ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించాలంటే పంట పొలాల నుంచి దిగుబడిని వాహనాల్లో తీసుకురావాల్సి ఉంటుంది. ఇక్కడికి వచ్చాకా.. రవాణ ఖర్చుతో పాటు హమాలీల కూలి డబ్బులు తడిసి మోపెడవుతోంది. ఇక తడిసిన, తేమ ఉన్న ధాన్యాన్ని తీసుకుకోక పోవడం మాకు నష్టమే అవుతుంది. తడిసి, తేమ ఉన్న ధాన్యం కొనుగోలు చేయడంతో పాటు..హమాలీలకు కూలి డబ్బులు ప్రభుత్వమే చెల్లిస్తే రైతులకు మేలు చేకూరుతుంది.

– చిట్టి రఘుపతి, రైతు, సిరిగిరిపురం, మహేశ్వరం

రైతులకు అవగాహన కల్పించని అధికారులు

చేవెళ్ల: చేవెళ్ల డివిజన్‌ పరిధి ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలు కొనుగోలు ప్రక్రియ లేక బోసిపోతున్నాయి. ప్రభుత్వం మద్దతు ధర రూ.2,203లు ఇస్తుండగా.. ప్రైవేటు వ్యక్తులు రూ.2,100 నుంచి 2,300 వరకు చెల్లిస్తున్నారు. ధరలో నెలకొన్న వ్యత్యాసం వలనే.. రైతులు తమ ధాన్యాన్ని ప్రైవేటు వ్యక్తులకు విక్రయించి, సొమ్ముచేసుకుంటున్నట్లు సమాచారం. సోమవారం శంకర్‌పల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని 'సాక్షి' విజిట్‌ చేయగా అది ఖాళీగా దర్శనమిచ్చింది. ఇదే విషయమై.. ఇన్‌చార్జి శివారెడ్డిని వివరణ కోరగా.. ఇక్కడి రైతుల కోసం శంకర్‌పల్లి మండల కేంద్రం మార్కెట్‌ యార్డులో ప్రభుత్వం కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసింది. ఇక నాటి నుంచి నేటి వరకు 50 మంది రైతులు.. 10వేల ధాన్యం బస్తాలను మాత్రమే కేంద్రానికి తీసుకువచ్చారని తెలిపారు. రెండు మూడు రోజులుగా కేంద్రానికి రైతులు ఎవరూ రాకపోవటంతో దీనిని మూసివేయాలని పై అధికారులు ఆదేశించినట్లు ఆయన పేర్కొన్నారు. సేకరించిన ధాన్యం డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతున్నాయని వెల్లడించారు. ఇదిలా ఉండగా.. కొనుగోలు కేంద్రాలపై సంబంధిత అధికారులు రైతులకు సరైన అవగాహన కల్పించక పోవడం వలనే.. కొనుగోలు కేంద్రాలు ఖాళీగా దర్శనమిస్తున్నట్లు తెలుస్తోంది.

కేంద్రం ఉన్నట్లు తెలియదు



ఇక్కడ ప్రభుత్వ కొనుగోలు కేంద్రం ఉన్నట్లు తెలియదు. అందుకే మిల్లు వద్దకు వచ్చాను. ప్రభుత్వం రూ.500 బోనస్‌ ఇవ్వటం లేదు. మూడు ఎకరాల్లో వరి సాగు చేశాను. 176 బస్తాల ధాన్యం వచ్చింది. తేమగా ఉందని ఇక్కడే ఆరబెట్టాను. కొనుగోలు కేంద్రాలు ఉన్నట్లు రైతులకు చెప్పాలికదా.

– నర్సింలు, రైతు గొల్లగూడ

విద్యుదాఘాతంతో ఇద్దరు మృతి

చేవెళ్ల, పహాడీషరీఫ్‌లో ఘటన


రాజు (ఫైల్‌)

చేవెళ్ల: ఇంట్లో ఉన్న సంపులో నీటిని తోడుతుండగా.. ప్రమాదశాత్తు కరెంట్‌షాక్‌ తగిలి అదే సంపులో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన మండల కేంద్రంలోని టీచర్స్‌ కాలనీలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్‌ జిల్లా టేక్మాల్‌ మండలం, మార్గవానికుంటతండాకు చెందిన రాజు(32) బతుకు దెరువుకోసం భార్య పిల్లలతో కలిసి చేవెళ్లకు వచ్చి టీచర్స్‌ కాలనీలో నివాసం ఉంటున్నాడు. దంపతులు ఇద్దరూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. సోమవారం భార్య కూలీ పనులకు వెళ్లగా.. రాజు కూలీ పనులు లేక ఇంటివద్దే ఉన్నాడు. ఈ క్రమంలో స్నానం చేసేందుకు సంపులోని మోటార్‌ ఆన్‌ చేశాడు. నీళ్లు రాకపోవటంతో సంపులో నీటిని తోడేందుకు యత్నించాడు. ఈ క్రమంలో పక్కనే ఉన్న మోటార్‌ వైర్‌ తగిలి, షాక్‌ కొట్టడంతో సంపులో పడి మృతి చెందాడు. ఇది చూసిన మృతుడి కొడుకు పెద్దగా అరవటంతో చుట్టుపక్కల వారు వచ్చి, వైర్‌ను తొలగించి రాజును పైకి తీశారు. అప్పటికే అతడు మృతి చెందాడు. స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు.. వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఇనుప కడ్డికి తీగ తగిలి..


నేహ కాతూన్‌(ఫైల్‌)

పహాడీషరీఫ్‌: విద్యుత్‌ ఘాతంతో గృహిణి మృతి చెందిన సంఘటన స్థానిక పోలీస్‌స్టేషన్‌ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జార్ఖండ్‌ రాష్ట్రానికి చెందిన హసన్‌ అన్సారీ, నేహ కాతూన్‌(27) దంపతులు ఇద్దరు పిల్లలతో కలిసి ఏడాది క్రితం జల్‌పల్లి శ్రీరాం కాలనీకి వలస వచ్చారు. ప్లాస్టిక్‌ పరిశ్రమలో పనిచేస్తూ, యజమానికి చెందిన అమన్‌ బ్యాటరీ కంపెనీలోని మొదటి అంతస్తులో నివాసం ఉంటున్నారు. ఈ నెల 26న రాత్రి 11 గంటలకు గదిలో విద్యుత్‌ సరఫరా నిలిచిపోయిందని, నేహ గ్రౌండ్‌ ఫ్లోర్‌కు వచ్చింది. గదికి తాళం వేసి ఉండడంతో.. ఇనుప కడ్డితో తాళం పగలగొట్టేందుకు యత్నించింది. ఈ క్రమంలో ఐరన్‌ రాడ్‌ విద్యుత్‌ వైర్లకు తగలడంతో ఆమె షాక్‌కు గురయింది. గమనించిన భర్త.. ఆమెను చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ నేహ మృతి చెందింది. కేసు దర్యాప్తులో ఉంది.

సాగులో జాగ్రత్తలు తప్పనిసరి

- అధికారుల సూచనలు పాటించండి
- జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి


కార్యక్రమంలో మాట్లాడుతున్న గీతారెడ్డి

చేవెళ్ల: 'వానాకాలం సీజన్‌ ప్రారంభం అవుతుంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి' అని జిల్లా వ్యవసాయ అధికారి గీతారెడ్డి అన్నారు. శంకర్‌పల్లి మండలం దోబీపేట్‌ గ్రామంలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. రైతులకు విత్తనాల కొనుగోలుకు సంబంధించి సూచనలు, సలహాలు ఇచ్చారు. అనంతరం మాట్లాడారు. విత్తనాలను గుర్తింపు పొందిన దుకాణంలో కొనుగోలు చేయాలని, అనంతరం రసీదు తీసుకోవాలని సూచించారు. రసీదు, విత్తనాల ప్యాకెట్‌ను పంట కాలం పూర్తయ్యే వరకు దాచి ఉంచాలని చెప్పారు. విత్తనాల ఎంపికలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, లూజు విత్తనాలను అసలు కొనుగోలు చేయవద్దన్నారు. రైతులు వ్యవసాధికారుల సలహాలు, సూచనలు పాటించాలని చెప్పారు. కార్యక్రమంలో చేవెళ్ల ఏడీఏ రమాదేవి, శంకర్‌పల్లి ఏఓ సురేశ్‌బాబు ఏఈఓ రమ్య, రైతులు తదితరులు ఉన్నారు.

మూడు ఇళ్లలో చోరీ

తులం బంగారం, నగదు అపహరణ

ఆమనగల్లు: పట్టణంలోని గుర్రంగుట్ట కాలనీలో ఆదివారం రాత్రి 3 ఇళ్లలో చోరి జరిగింది. ఆయా ఇళ్లలో తులం బంగారం, 15 తులాల వెండి, కొంత నగదును దొంగలు దోచుకెళ్లారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుర్రంగుట్ట కాలనీకి చెందిన వరికుప్పల కృష్ణయ్య దంపతులు ఆదివారం సాయంత్రం ఇంటికి తాళం వేసి బంధువుల ఇంటికి వెళ్లి సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటితాళం పగులగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బీరువాలో ఉన్న బట్టలు చిందరవందరగా పడున్నాయి. పరిశీలించగా.. అందులో ఉన్న తులం బంగారం, 15 తులాల వెండి చోరీకి గురైనట్లు గుర్తించారు. అదేవిధంగా అదే కాలనీకి చెందిన పసుపులేటి వెంకటేశ్‌, రాజేంద్రప్రసాద్‌ ఇంటి తాళాలు పగులగొట్టి నగదు అపహరించారు. దీనిపై బాధితులు ఆమనగల్లు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.